# వాచీదొంగ

ఆ వేళ ఆదివారం. అన్నయ్య కాస్త ఆలస్యంగా లేచాడు. ఎందుచేతంటే క్రితంరాత్రి 'సెకండు షో సినిమా'కి వెళ్లాడు. కళ్లు ఎర్రగా జేవురించి వున్నాయి. కళ్ళు నులుపుకుంటూ, వొళ్ళు విరుచుకుంటూ, బద్ధకంగా పక్కమీదనుంచి లేచాడు. టేబిల్పుమీదున్న తన 'రిస్టువాచీ'ని చూచాడు. 8-30 అయింది. బ్రష్, టూత్ పేస్టు, నాలికబద్ద తీసుకొని పెరట్లోకి వెళ్లాడు పళ్లు తోముకుందుకు. పెరట్లో అరుగుమీద కూర్చుని, పళ్లు తోముకుని, నీళ్ళ కోసం తన పక్కన చూచాడు. కాని తను నీళ్లు తెచ్చుకోవటం మరచిపోయేడు. ఎప్పుడూ నీళ్లు ముందుగానే తెచ్చుకునేవాడు. కాని ఇవాళ అంతా మతి మరుపులా వుంది. ఇంకా నిద్రమత్తు వొదలలేనట్లుంది. తన గదిలోంచి సరాసరి పెరట్లోకి వచ్చేశాడు. అంచేత నీళ్లు తెచ్చుకోవటమే మరచిపోయాడు.

"సూర్యం! సూర్యం!" అని కేకవేశాడు అన్నయ్య

వస్తున్నా నన్నయ్యా!" అని అన్నయ్యని సమీపించాడు సూర్యం. అన్నయ్య బ్రష్ నోట్లో పెట్టుకొని అదోలా ఆలోచిస్తున్నాడు "ఎందుకన్నయ్యా పిలిచావు" అన్న సూర్యం మాటకి అన్నయ్య-మళ్ళా ఈ ప్రపంచంలో పడ్డాడు. "ఒక చెంబుతో నీళ్లు తీసుకరా, మొహం కడుక్కుంటాను" అన్నాడు. "అలాగే తీసుకొస్తాను," అని చెప్పి సూర్యం నీళ్లు తేవటానికి వెళ్ళాడు.

రమేశ్ కుమార్

కళ్లు కొద్దిగా మండుతున్నాయి. ఎన్నడూ లేని బద్ధకం ఇవాళ తనకి వచ్చి పడింది. అంతా అయోమయంగా వున్నట్టుంది. ఎప్పుడూ అన్నయ్య సూర్యోదయానికి ముందుగా లేచేవాడు. కాని క్రితం రాత్రి సెకండు షోకి వెళ్ళటం మూలాన ఇవాళ ఆలస్యంగా లేచాడు. అబ్బ! ఏమిటోగా వుంది వొంట్లో. అన్నయ్య క్రితం రాత్రి సెకండు షోకి వెళ్ళినందుకు తనని తాను నిందించుకున్నాడు. తను ఇది ఇదివరకెప్పుడూ సెకండుషోకి వెళ్ళలేదు. ఒకటి రెండుసార్లుమాత్రం బావతో వెళ్లాడు, అంతే! అదేనా బావ చిన్న బుచ్చుకుంటాడనిగాని, లేకపోతే సుతరామూ వెళ్లేవాడు కాదు. ఐతే, క్రితం రాత్రి ఎందుకెళ్ళినట్లు? తన తోటిలెక్చరర్స్ అంతా పట్టుపట్టి, మరీ తీసుకెళ్ళారు. "నేను రాను! నన్నీసారికి వొదిలేద్దురూ?" అని తను అన్నా వాళ్ళు వొప్పుకున్నారూ? బలవంతాన తీసుకెళ్ళారు. మా ఇంటి ప్రక్కనేవున్న లెక్కల లెక్చరర్ భాస్కరరావుగారు మరీను! "ఏమిటోయ్ సుబ్రహ్మణ్యం! సరదాగా లెక్చరర్స్ నలుగురూ కలసి వెళ్దామనుకుంటే నువ్వు రానుపొమ్మంటే, బాగుంటుందా?" అని బ్రతిమాలి మరీ లాక్కెళ్లారు. అన్నయ్య కాలేజీలో సైన్సు లెక్చరర్ గా పనిచేస్తున్నాడు. భాస్కరరావుగారూ, అన్నయ్యా ఇంటర్మీడియట్ వరకూ క్లాసుమేట్స్! కాని ఆనర్స్‌లో గ్రూపు మార్చుకున్నారు. అన్నయ్యకి సైన్సుమీద ఇష్టం వుంది. కాబట్టి, ఆనర్స్‌లో సైన్సు గ్రూపు తీసుకున్నాడు. భాస్కరరావుగారికి లెక్కలంటే బలే ఆసక్తి. అంచేత ఆయన ఆనర్స్‌లో లెక్కల గ్రూపు తీసుకున్నారు. ఇద్దరికీ అదృష్టంవల్ల ఉన్న వూర్లోనే ఉద్యోగం దొరికింది. భాస్కరరావుగారు రాత్రి బలవంతం చేసినందుకు, దాని ఫలితంగా ఇప్పుడు తనకు బద్ధకం మతిమరపు కలిగినందుకు అన్నయ్య ఆయన్ని నిందించాడు... 'సెకండు షో' ప్రభావం అన్నయ్యమీద ఈ విధంగా పని చేసింది.

సూర్యం చెంబుతో నీళ్లు పట్టుకుని తయారయ్యాడు. అన్నయ్య

చెంబులోని నీళ్లతో ముఖం కడుక్కోటం పూర్తి చేసి, సూర్యాన్ని తనతో తన గదికి తీసుకెళ్లాడు. బ్రష్...వగైరాలు టేబిలు మీద పెట్టి, ఓ పావలా తీసి వాడి చేతికిచ్చి "బేడిచ్చి రెండు ఇడ్డెన్లు పట్టుకరా, కారం పొడి వేయించడం మరచిపోకు, ముద్దచెట్నీ వేరేగా కట్టించు. మిగతా బేడ నువ్వు తీసుకో! వేగంగా రావాలి సుమా!" అని చెప్పాడు. సూర్యానికి డబ్బులిస్తే చాలు ఎటువంటి పనైనా చిటికెలో చేస్తాడు. "అన్నయ్యా! వెల్కం హోటల్లోనా, లేక ఉడిపీఅయ్యరు హోటల్లోనా? దేంట్లో తెమ్మంటావ్?" అని అడిగాడు. "దేంట్లోనో వొకదాంట్లో తీసుకురా. వెధవ చొప్పదండు ప్రశ్నలూ, నువ్వూను" అన్నాడు అన్నయ్య చిరాగ్గా. "సాంబారైతే ఉడిపీ గాన్ని, కారం పొడీ అయితే వెల్కంవాడే బాగా చేస్తాడు, అంచేత వెల్కంలోనే తెస్తా" నంటూ సూర్యం వెళ్ళిపోయాడు. అన్నయ్య వాడి మాటలకి నవ్వుకున్నాడు తనలో తాను.



"ఏయ్, తప్పు!"

ఫొటో: బి. రవీంద్రనాథ్ —గుంటూరు.

పాలు పొంగటానికి సిద్ధంగా వున్నాయి. అన్నయ్య వెంటనే క్రిందకి దింపి, ఓవల్టీను, కాస్త పంచదార కలుపుకుని, తన గదిలోకి తెచ్చుకున్నాడు. ఇంతలోకి సూర్యం పొట్లాలు పట్టుకునివచ్చాడు. "అరె! చాల వేగంగా తీసుకొచ్చావే! పనికొస్తావురా సూర్యం! ఈ చలాకీ చదువులోకూడ కాస్త చూపించు!" అన్నాడు అన్నయ్య. "నేనూ పెద్ద చదువు చదివి నీలా లెక్చరర్నవుతా నన్నయ్యా!" అన్నాడు సూర్యం. "అయ్యవారి వుద్యోగం ఏం ఖర్మంరా నీకు. నువ్వు కలక్టరు వగుదువు గాని", అని అన్నయ్యవాణ్ణి వుబ్బించాడు. అన్నయ్య పొట్లాలు విప్పుతూ, "మరి నీకు బేడ ఇచ్చానుగా, వెళ్ళు." అన్నాడు. సూర్యం గదిలోంచి బయటకు వచ్చేశాడు. అన్నయ్య ఫలహారంపూర్తిచేసి ఓవల్టీను సేవించి, ఆకులు చుట్టబెట్టి కిటికీలోంచి సందులోకి పారేశాడు. సావిట్లో గోడగడియారం తొమ్మిది గంటలు కొట్టింది. అన్నయ్య టేబిలుమీదున్న తన 'రిస్టువాచీ' చూచుకున్నాడు. అదీ సరిగ్గా తొమ్మిదే అయింది. ఎడంచేత్తో తువ్వాలు తీసుకొని భుజంమీద వేసుకొని, కుడిచేత్తో గ్లాసూ, గిన్నె పట్టుకుని తలుపు తీసుకుని సందులోంచి పెరట్లోకి వెళ్లేడు. దాసీ దాన్ని గిన్నె గ్లాసూ తీసుకోమని తను ఇంట్లోకి వెళ్లి కుళాయిదగ్గర చేతులు కడుక్కొని, సబ్బు పెట్టె తీసుకుని మళ్ళా పెరట్లో నూతి దగ్గరకు వచ్చాడు, స్నానం చెయ్యటానికి. అన్నయ్యకి వేసవికాలంలో నూతిదగ్గర స్నానం చెయ్యటమే అలవాటు.

బాలగేయం:

# బడిలో చిన్నది

శ. కోటి

మా బడిలో ముచ్చటైన
చిన్న దొరసాని ఉండు!
ఆమె నన్న గైకొనియే
బడి నడచుచునుండు!

అందమైన మోమా మెది
గుండ్రంగా నుండు.
ముక్కు, చెవులు లేవు గాని
ముచ్చటగా నుండు!

చేతులు గల వామెకు, మరి
చిత్రముగా రెండు!
వేళ్లు లేవు గాని మరీ
విచిత్రముగ నుండు!

ఠీవిగాను నడచు నామె
టిక్ టాక్ మనుచుండు.
మితభాషిణియైన, గొంతు
ఖంగ్ ఖంగ్ మనుచుండు!

చెప్పుకోండి, చిన్నదాని
పేరేమైయుండు!
తెలియనిచో, గోడమీద
నున్న దామె రండు!

## ★ వాచీ దొంగ ★

### 2

స్నానం ముగించుకొని మళ్ళా యథాప్రకారంగా తన గదిలోకి వందులోనుంచే వచ్చాడు. తడితలకే కాస్త వాసననూనె రాచుకుని దువ్వుకుని, బట్టలు వేసుకున్నాడు వాచీపెట్టుకుందామని టేబిలుమీద చూస్తే వాచీ లేదు. అన్నయ్యకి గుండె ఆగినంత పని అయింది. గాభరా పడ్డాడు. గది అంతా వెతకటం ప్రారంభించాడు. గుండె దడ, దడా కొట్టుకుంటోంది. "సూర్యం! సూర్యం!" అని పిలిచాడు. సూర్యం వచ్చాడు. "నువ్వు నా వాచీకాని తీశావా?" అని అడిగాడు. "నేను తియ్యలేదన్నయ్యా!" అని జవాబిచ్చాడు. "నీకు డబ్బులిచ్చానుగా, మరో బేడ కూడ ఇస్తానులే! నా వాచీ తీస్తే చెప్పు-ఎక్కడపెట్టావో?" అన్నాడు. సూర్యం, "నాకు తెలీదు. నేను తియ్యలేదు. నువ్విందాకా వెళ్లిపోమన్న తర్వాత నేను వెళ్లిపోయాను. అప్పటినుంచి, ఇప్పటివరకూ అక్కయ్యతో నే వున్నాను. అక్కయ్య నాకు హిందీ అక్షరాలు నేర్పుతోంది. మళ్ళా నేను నీ గదిలోకి రాలేదు. నిజంగా నాకు తెలీదు" అని ఏడుపు మొహం పెట్టాడు. "నువ్వెళ్లి అక్కయ్యను పిలుచుకురా! ఎవ్వరితోనూ నా వాచీ పోయిందని చెప్పకు. వెధవ్వి, నువ్వు రేడియోలాంటి వాడివి!" సూర్యం వెళ్లిపోయ్యాడు అక్కయ్యను పిలుచుకురావటానికి. "అవును! వాడు వెళ్లిపోయిన తర్వాత సావిట్లో గడియారం తొమ్మిది కొట్టింది. అప్పుడు నేను రిస్టువాచీ'ని టేబిలుమీదుండగా చూశాను. అదీ సరిగ్గా తొమ్మిది గంటలే చూపింది. అవును సూర్యానికి తెలీదు పాపం! వాడికి ఏమైనా తినే వస్తువులు కావాలి గాని, వాచీతో వాడికేంపని? ఆఁ......

అన్నట్లు వాడు అప్పుడప్పుడు సరదాపడి వాచీ పెట్టమంటే, నేను వాడి చేతికి 4, 5 సార్లు పెట్టాను. కాని, వాడు నా గదివిడిచి వాచీతో బయటకి వెళ్లేవాడుకాదు. ఓ ఐదు నిముషాలు వాడి చేతిని వుంచుకొని తరువాత వాచీ తీసెయ్యమంటే తీసేవాడిని. వాడి ఏడుపు మొహం చూస్తూంటేనే తెలుస్తోంది-వాడు తియ్యలేదని. అదీ కాక, వాడు నాగది విడిచిన దగ్గరునుంచి ఇంతవరకూ మిగతా పిల్లలతో కలసి అక్కయ్యదగ్గర హిందీ అక్షరాలు నేర్చుకుంటున్నాడుట. ఐతే ఎవరు తీశారు?" అని అన్నయ్య తనలో తాను ప్రశ్నించుకుంటూండగా అక్కయ్య వచ్చింది సూర్యంతో సహా. సూర్యం బిక్కమొహం చూస్తూంటే వాడినిందాకా "నువ్వు వాచీ తీశావా?" అని ఎందుకు అడిగానా అనిపిస్తోంది అన్నయ్యకి.

"అక్కయ్యా! నా వాచీ పోయిందే?" అన్నాడు అన్నయ్య.

"ఎలా పోయింది," అంది అక్కయ్య.

"నేను సరిగ్గా తొమ్మిది గంటలకు స్నానం చెయ్యటానికి వెళ్లాను వెళ్ళేటప్పుడు వాచీ టేబిలుమీద వుంది. నేను మళ్లీ, స్నానం చేసి తిరిగివచ్చి, తలదువ్వుకుని, బట్టలు వేసుకుని, వాచీపెట్టుకుందామని టేబిలుమీద చూస్తే వాచీ లేదు. ఎలా పోయిందో? ఎవరు తీసివుంటారో? తెలియటంలేదు. మొన్న ఫస్టు తారీఖున జీతం అందుకున్న తరువాత, జీతం తీసుకొచ్చి నాన్నకివ్వబోతే, 'నీకు చిన్నప్పటినుంచీ వాచీపెట్టుకోవాలని సరదాగా వుండేది. నన్ను ఎన్నోసార్లు వాచీ కొనమని అడిగావు. కాని నేను నీకింతవరకూ వాచీ కొనివ్వలేదు. నువ్వు ఇప్పుడు లెక్చరర్‌వి. జీతగాడివి. హోదాలో వున్నవాడివి. ఈ డబ్బుతో నీకు నచ్చిన వాచీ కొనుక్కో. పదో, పాతికో కావలిస్తే నేను ఇస్తాను,' అని నాన్న అంటే వాచీ కొనుక్కున్నాను. 'వాచీ ఖరీదు నూటయాభైరూపాయలు. నాన్నకి తెలిస్తే ఏమంటాడో?' అక్కయ్యా! నువ్వేకనుక్కోవాలే వాచీ ఎవరు తీశారో!" అన్నాడు అన్నయ్య దీనంగా. అన్నయ్య కళ్ళలో నీళ్లు తిరిగాయి. కనుకొనుకుల్లోంచి ఆ నీరు బుగ్గలమీదుగా నేలమీద పడింది. అన్నయ్య ఎంత లెక్చరర్ అయినా, ఎంత మేధావంతుడైనా, ఉత్తప్పుడు ఎంత ధైర్యంగావున్నా, పాపం ఇప్పుడు కళ్ళ నీళ్లుకూడ పెట్టుకున్నాడు. భయపడ్డాడు! ఆశ్చర్యపడ్డాడు!! విచారిస్తున్నాడు!!! "నూటయాభై రూపాయలకు నీళ్లు వొదులుకోవటమేనా? కాని నెల్లాళ్లు కూడా కాలేదు. సరదా అయినా పూర్తిగా తీరలేదు. ఒక నెల కష్టపడి, చెమటోడ్చి సంపాదించిన డబ్బు. నా కష్టార్జితం, నా జీవితంలో ప్రథమంగా ఆర్జించిన ఈ డబ్బు నాకు దక్కకుండా పోవటమేనా?" అన్నయ్య చిన్న కుర్రాడిలా మాట్లాడుతున్నాడు.

"నువ్వు స్నానానికి ఏ తోవగుండా వెళ్ళావు? ఇంట్లోనుంచా? సందులోనుంచా?" అని అన్నయ్యని అక్కయ్య ప్రశ్నించింది.

"సందులోనుంచే వెళ్ళాను," అన్నాడు అన్నయ్య.

"ఐతే తలుపులు తీసే వెళ్ళావన్నమాట!"

"తలుపులు దగ్గరగా జారవేశాను."

"స్నానంచెయ్యటం ముగించుకుని మళ్ళీ ఎన్నిగంటలకి నీ గది చేరుకున్నావు?

"సుమారు ఒక అరగంటలో చేరిఉండవచ్చును."

"నువ్వు పెరట్లో నూతిదగ్గర స్నానం చేస్తున్నప్పుడు మనింట్లోకిగాని, పెరట్లోకిగాని సందుగుండా, అంటే నీ రూము ముందునుంచి ఎవరేనా రావటము చూశావా?"

"ఊహుఁ......నేను చూడలేదు. అదీకాక ఎలా చూడగలుగుతాను గడ్డిమోపు అడ్డుగా వుందికదూ?"

"మన దాసీదికాని అటువేపు వెళ్లిందా?"

"లేదు వెళ్లలేదు. నేను స్నానం చేస్తూన్నంతసేపు అదీ, దాని కూతురూ, అన్నం తింటున్నారు."

మా ఇంటిముందు కొద్దిగా ఖాళీ ప్రదేశముంది. ఆ ఖాళీ ప్రదేశాన్ని చిన్న పార్కులా చెయించింది అక్కయ్య. సాయంకాలం అక్కడ కుర్చీ వేసుకుని బాబయ్య పేపరు చదువుతూ కూర్చుంటాడు. పిల్లలు ఆడుకుంటారు. మడత కుర్చీ వేసుకుని, తాతయ్య దాంట్లో కూలబడతాడు. ఇంటికెవరేనా వస్తే, కుర్చీలు వేసుకుని అక్కడ కూర్చుని మాట్లాడుకుంటారు. పార్కుకి ముందు ఎత్తుగోడలతో రెండు వీధిగుమ్మాలున్నాయి. ఒక గుమ్మం సందు గుమ్మానికి ఎదురుగా వుంది. ఇంకో గుమ్మం సావిడి గుమ్మానికి ఎదురుగా వుంది. అన్నయ్య గదికి మొత్తంమూడుద్వారాలున్నాయి. ఒకటి పక్కన వున్న అక్కయ్య గదికి, రెండవది ఇంట్లోకి, మూడవది సందులోకి.

అక్కయ్య సందువైపు వున్న ద్వారం తలుపులు తీసింది. అన్నయ్య గది సందులోని నేలకన్న ఎత్తుగా వుంది కాబట్టి, ఇటూ, అటూ మెట్లున్నాయి. అక్కయ్య మెట్లు దిగబోతోంది, అక్కయ్యకేదో కనిపించింది, తక్కున ఆగింది. అన్నయ్యకి, సూర్యానికి ఏం బోధపడలేదు; "ఎందు కాగింది?" అన్న సందేహం కలిగింది వారికి. "ఎందు కాగావు అక్కయ్యా?" అని ప్రశ్నించాడు అన్నయ్య.

"దొంగ దొరికాడు!" అంది అక్కయ్య.

"ఎవరు?" అన్నాడు అన్నయ్య సంతోషంగా.

"ఇప్పుడు చెప్పను; నా అనుమానం స్థిరపడేదాకా చెప్పను," అని కిందికి వంగి ఆ వస్తువును పరిశీలించింది. సూర్యం, అన్నయ్య

# ★ వాచీ దొంగ ★

ఆ వస్తువును చూడకుండా తనకాలు ఆ వస్తువుమీద పెట్టేసింది.

అక్కయ్య దాసీ దాన్ని పిలిచింది, అది వచ్చింది.

"దాసీది ఎందుకు చెప్మా! అది నేను స్నానం చేస్తూన్నంత సేపూ దాని కూతురుతో పాటు చద్ది అన్నం తింటోంది కదా? అనుకున్నాడు అన్నయ్య.

"ఏవేఁ నీ కొడుకు వచ్చాడా?" అని అడిగింది అక్క.

"ఇంకా రాలేదమ్మా! రోజూ ఈపాటికే వచ్చేవాడు, చద్ది అన్నం తినటానికి; కాని ఇవాళ ఎందుచేత రాలేదో తెలియటం లేదు. అవును గాని పెద్దమ్మాయి గోరూ! ఆడి గురించి అడుగుతున్నారూ, మా వాడు ఏమైనా..." అని దాసీది అడగబోతూంటే, దాన్ని మధ్యలోనే వారించి, "అహఁ, ఏం లేదు! ఉత్తినే అడిగాను. వాడు రోజూ చద్ది అన్నం తినడానికి వచ్చేవేళ కదా, ఇది ఇంకా వచ్చినట్టు లేదని అడిగాను," అంది అక్కయ్య.

"అంతే కదా! ఇంకా ఏటో, మావాడు ఏంచేశాడో అనుకున్నాను. వస్తాను తల్లీ!" అని దాసీది వెళ్లిపోయింది.

అక్కయ్య సావిట్లోకి వెళ్ళి గడియారం చూసింది. పావు తక్కువ పది అయింది. "నువ్వు ఇప్పుడు మన దాసీదాని ఇంటికి వెళ్లాలి. దాని కొడుకు "సోవిఁగాడు" అక్కడ వుంటాడు. వాడిని మనింటికి తీసుకురా. వాడిదగ్గర వాచీ విషయం ఏమీ ఎత్తకు, నెమ్మదిగా మంచి మాటలాడి తీసుకురా. రానంటాడు. అప్పుడు బలవంతాన తీసుకురా. నాలుగు తగలనియ్యి, మరేం ఫరవా లేదు!" అంది అక్కయ్య.

"ఏమిటి, మన దాసీదాని కొడుకు "సోవిఁగాడు" తీశాడా నా వాచీ? పాపం, వాడు ఇవాళ పొద్దుటనుంచీ మనింటికి రాలేదు కదా, వాడే తీశాడని ఎలా అనుకుంటాం? వాడెందుకు?" అన్నాడు అన్నయ్య వాడిని తీసుకురావటము అనవసరము అని సూచించేటట్టుగా మొహం పెట్టి.

"నన్ను మధ్యలో ఏమీ ప్రశ్నించవద్దు. వాడు తీశాడని, నేననటం లేదుగా. వాడిని తీసుకు రమ్మన్నాను. అంతే! తీసుకు రావటం నీవంతు. త్వరగా వెళ్లు," అంది అక్కయ్య.

"నాకు, మరి మన దాసీదాని ఇల్లు తెలీదు," అన్నాడు అన్నయ్య.

"నాకు తెలుసునక్కయ్యా!




# కోడిపెట్ట – చిక్కుడు గింజ

కొంతకాలం క్రిందట, ఒకవూళ్లో ఒక కోడిపెట్టా, కోడిపుంజూ వుండేవి. ఒకరోజున కోడిపుంజు, తోటలోని మన్ను తవ్వుతుండగా ఒక చిక్కుడు గింజ బయటపడింది.

"ఈ చిక్కుడు గింజను నువ్వు తిను" అంది కోడిపెట్టతో.

"అహాఁ, అలాకాదు! దీన్ని నువ్వే తిను" అంది కోడిపెట్ట.

"అయితే సరే – " అంటూ ఆ చిక్కుడుగింజను ఒక్క గుటకతో మింగేసింది కోడిపుంజు. కాని, పాపం, ఆ గింజ తిన్నగా కడుపులోకిపోక గొంతుకు అడ్డంగా నిలిచిపోయింది.

"నదిదగ్గిరకి వెళ్లి తాగటానికి కాసినినీళ్లుయిమ్మని అడుగు" అంటూ కోడిపెట్టని బ్రతిమిలాడింది.

ఏం చేస్తుంది పాపం! కోడిపెట్టకు వెళ్ళక తప్పిందికాదు.

"ఓనదీ, మా కోడిపుంజు గొంతులో చిక్కుడు గింజ అడ్డంపడింది; కాసినినీళ్ళియ్యవూ తాగటానికి?" అని ప్రాధేయపూర్వకంగా అడిగింది.

అంటే నది సమాధానం చెప్పింది! "అలాగా? అయితే నువ్వు సరాసరి నిమ్మచెట్టుదగ్గిరకి వెళ్లి ఒక ఆకు అడిగి తీసుకురా, అప్పుడు నీకు నీళ్లిస్తాను."

వేరే గత్యంతరంలేక కోడిపెట్ట నిమ్మచెట్టుదగ్గిరకి పరుగెట్టింది.

"ఓ నిమ్మచెట్టూ! నాకో ఆకు యివ్వవూ! ఆ ఆకు తీసుకువెళ్లి నదికిస్తే, నది నాకు నీళ్లిస్తే, ఆనీళ్లు తీసుకువెళ్లి కోడిపుంజుకుయిస్తే, కోడిపుంజు ఆనీళ్లు తాగితే, చిక్కుడు గింజ గొంతులోంచి జారుతుంది." అంటూ జాలిగొలిపేటట్లు అడిగింది.

కాని, నిమ్మచెట్టు ఏమందంటే: "అయితే నువ్వు రైతుకూతురుదగ్గిరకి వెళ్ళి కొంచం దారం అడిగి తీసుకురా" అని అంది.

వెంటనే కోడిపెట్టకు మరో మార్గం కనుపించక నిమ్మచెట్టు చెప్పినట్లు రైతుకూతురుదగ్గిరకు పరుగెత్తింది.

"ఓ రైతుకూతురా. మా కోడిపుంజు గొంతులో చిక్కుడుగింజ అడ్డంపడింది. అందుకు నీళ్ళు కావాలి. నదిని అడిగితే నిమ్మ ఆకు తెమ్మంది. నిమ్మచెట్టు నడిగితే దారం తెమ్మంది కాస్త దారం యియ్యవూ?" అంది అనునయంగా!

అయితే రైతుకూతురు కోడిపెట్టను చూసి—"నువ్వు వెళ్ళి దువ్వెన్నలు చేసేవాణ్ణి అడిగి ఒక దువ్వెన తీసుకువస్తే, నీకు దారం యిస్తా" అని అంది.

వెంటనే కోడిపెట్ట దువ్వెన్నలు చేసేవాడిదగ్గిరకి పోయింది.

"అయ్యా, మా కోడిపుంజుకి గొంతులో చిక్కుడుగింజ అడ్డం పడింది. నీళ్ళకోసం నదికి వెళ్తే నిమ్మాకు తెమ్మంది. నిమ్మచెట్టు దారం కావాలంది. రైతుకూతురు దువ్వెన తీసుకురమ్మంది. దయవుంచి ఒక దువ్వెన యియ్యవూ?" అంటూ ప్రార్థించింది.

ఆ దువ్వెన్నలు చేసేవాడు కోడిపెట్టను చూసి—"అలాగా పాపం! అయితే నువ్వు వెళ్లి మాకు కొన్ని రొట్టెలు తెచ్చిపెట్టు. అప్పుడు నీకు దువ్వెన యిస్తాను"—అంది.

కోడి పెట్టకు ఏమీ తోచక రొట్టెలవాడి దగ్గిరకి పరుగెత్తింది.

"అయ్యా, మా కోడిపుంజుకి గొంతులో చిక్కుడుగింజ అడ్డుపడింది. త్రాగటానికి నీళ్ల కోసం

---

మొన్న దాంతో కూడా దానింటికి వెళ్లాను," అన్నాడు సూర్యం.

"ఐతే మరీ మంచిది. సూర్యాన్ని తీసుకుని దానింటికి వెళ్లు. వాడక్కడ వుండొచ్చు. లేకపోతే, ఎక్కడికి వెళ్లాడో నాకు కబురు చెయ్యి. వాణ్ణెలాగయినా, ఎక్కడున్నా ఇక్కడికి తీసుకురా," అంది అక్కయ్య.

"రా అన్నయ్యా నాతో, మన దాసీ దానింటికి వెళ్దాం," అని అన్నయ్య చెయ్యిపట్టుకుని వీధిలోకి తీసుకెళ్ళాడు సూర్యం.

(గమితాకథ వచ్చేసంచికలో.)

# వాచీదొంగ

రమేష్ కుమార్

(గతసంచిక తరువాయి)

## 3

సూర్యం అన్నయ్యని ఉడిపి హోటలు దాటించి, వెల్కం హోటల్ ప్రక్కనున్న వీధిలోనుంచి తీసుకెళ్తున్నాడు. ఆ వీధిలో 'వెంకటేశ్వర టీ స్టాల్' అని ఒక డొక్కు టీ హోటలుంది. అన్నయ్య వేగంగా నడుస్తున్నాడు. వాళ్లు ఆ డొక్కు 'టీ' హోటలు ముందునుంచి వెళ్తున్నారు. సూర్యంకి దిక్కులు చూడ్డం అలవాటుగనక, యథాలాపనగా ఆ హోటల్లోకి చూశాడు. లోపల దాసీదానికొడుకు "సోవిఁగాడు" టీ తాగుతున్నాడు. అన్నయ్యా: అడుగో సోవిఁగాడు, అన్నాడు సూర్యం.

"ఎక్కడరా?" అన్నాడు అన్నయ్య ఆత్రతగా.

"అడుగో ఆ హోటల్లో," అని అన్నయ్య చెయ్యి పట్టుకొని డొక్కు టీ హోటల్లోకి తీసుకెళ్లాడు సూర్యం. రిక్షావాళ్లు, రోడ్డు తుడిచేవాళ్లు, సోవిఁగాడు — మొదలైన వాళ్ళంతా అక్కడ టీ సేవిస్తున్నారు. "దయచెయ్యండి, ఏమిటి కావాలి?" అని ప్రొప్రయిటరు తన సీటులోంచి లేచివచ్చాడు. రిక్షావాడు టీ తాగడానికి ఉపక్రమిస్తున్నాడు. అన్నయ్య మంచి బట్టలు చూసి, "ఈ హోటలుకెందుకు వచ్చాడా?" అని సందేహం కలిగి ప్రొప్రయిటరు తన సీటులోంచి అమాంతం లేచి వచ్చాడు. అన్నయ్యని చూడగానే "సోవిఁగాడు" టీ తాగుతున్నవాడల్లా అమాంతం లేచిపోయి, తను కూర్చున్న బల్లముందున్న టేబిలు మీద టీ గాసునుంచి పారిపోడానికి ప్రయత్నించాడు. అన్నయ్య అడ్డంగా నిలబడి, వాణ్ణి పారిపోకుండా చేశాడు.

"ఏమిటండీ, వీడేం చేశాడు?" అని అన్నయ్యని ప్రొప్రయిటరు అడిగాడు.

"అబ్బే! వీళ్లమ్మ మా యింట్లో దాసీదానిగా పనిచేస్తోంది. వీడు వీళ్లమ్మమీద అలిగి ఎక్కడికో పోతాన్నాట్ట! అది మా ఇంటిదగ్గర ఒకటే ఏడుపు! నేను ఇలా పోతూంటే వీడు కనిపించాడు. వీడి దగ్గర డబ్బులు తీసుకుని నాతో పంపించండి!" అన్నాడన్నయ్య.

"ఆరి, నీదుంపతెగ, ఇంతపనికి ఎగావా? ఏ ప్రాబుల్లోడా! తప్పు కదూ, మీ అమ్మని కష్టపెట్టటం? ఒరేయ్! వీడెంత ఇవ్వాలి?" అని అవతలవాణ్ణి అడిగాడు.

"రెండు ఇడ్డెన్లు బేడ, మరో బేడ ఉప్మా, ఒక అణా టీ," అని తనలో తను గట్టిగానే అనుకొని, ప్రొప్రయిటరుతో, "అయిదణాలు," అన్నాడు.

"సోవిఁగాడు "ఒక రూపాయి నోటు పక్క జేబులోంచి తీసి, ప్రొప్రయిటరు కిచ్చాడు. అతను చిల్లర డబ్బులు మిగతా 11 అణాలుఇస్తూ, "డబ్బులు మా జాస్తీగా వుండాయే, ఈడిదగ్గిర," అన్నాడు ఆశ్చర్యంగా.

సోవిఁగాడు, వీళ్ళని తప్పించుకుని పోదామని ప్రయత్నించాడు. అన్నయ్య చాల జాగ్రత్తగా వాణ్ణి కనిపెడుతూ ఇంటికితీసుకువచ్చాడు. వాడికి హోటల్లో అన్నయ్య చెప్పినదంతా విన్నతర్వాత, అయోమయంగా వుంది.

అక్కయ్యకి జరిగినదంతా అన్నయ్యా, సూర్యం చెప్పారు.

"నీ జేబులో ఎన్నిడబ్బు లున్నాయో, తియ్యి!" అంది అక్కయ్య.

"అబ్బే! నాదగ్గిరేం డబ్బులు లేవండి!" అని అనబోయి, అన్నయ్యను చూసి, పక్క జేబులో

చెయ్యిపెట్టి, ఒక రూపాయినోటు, పదకొండు అణాలు, మూఁడు బీడీలు-తీశాడు.

"నీ కీ డబ్బు లెక్కడివి ?"

"మా అమ్మ ఇచ్చిందండి!"

"ఐతే సూర్యం, నువ్వెళ్లి మన దాసీదాన్ని తిసుకరా! దాన్ని కనుక్కుందాం!" అంది అక్క.

"మా అమ్మ ఇవ్వలేదండి," అన్నాడు సోవిఁగాడు.

"మరైతే ఎక్కడవి న్ని డబ్బులు?"

"ఝూ డబ్బులాండీ — యీ డబ్బులూ—ఆఁ...దొరికాయండి."

"ఉహూఁ...మరిందాకా అబద్ధం ఎందుకు చెప్పావు?"

"ఉత్తినేనండి! మీరు దొరికాయంటే నమ్మరుకదా అని!'' వాడు సమర్థించుకున్నాడు.

"వాచీ ఎక్కడ దాచావు?"

"వాచీ ఏమిటండి?"

"పాపం! నీకేం తెలియదేం. నువ్వు ఇందాకా ఈ గదిలోంచి తీసిన వాచీ," అని అన్నయ్య గదిని చూపించింది అక్క.

"ఇవ్వాళ నేనసలుమీయింటికే రాలేదండి. మీ యింటికే రానప్పుడు, నేను వాచీదొంగిలించానడం ఏం బాగాలేదండి?" వాడు కొంచెం దబాయింపుగా అడిగాడు.

"తగ్గు! దబాయించకు! ఇవాళ నువ్వు మా ఇంటికొచ్చావు! నువ్వే వాచీ తీశావు! సందులోంచి మీ అమ్మదగ్గరకి వెళ్తున్నావు, ఈ గది తలుపులు తీసివుండడం చూశావు. కిటికీలోనుంచి లోపలికి తొంగి చూశావు. ఎవ్వరూ లేరు. గదిలో ప్రవేశించావు. వాచీ తీసుకుని మీ అమ్మదగ్గరకెళ్ళి చద్దిఅన్నం తినకుండా వచ్చిన దోవనే ఉడాయించావు!" అంది అక్కయ్య.

"ఏమిటండీ! మీరంతా చూసినట్టు మాట్లాడుతారు. నేనసలు మీ యింటికి రాలేదు మొర్రో అంటే?" అని వాడు కోపాన్ని కొద్దిగా ప్రదర్శించాడు.

"నేను చూడబట్టే అంటున్నాను. నేను నా గదిలో కిటికీలో నుంచి చూశాను, నువ్వు సందులో నుంచి వెళ్తుండగా - నువ్వు అసలు మా ఇంటికి రానేలేదని దబాయిస్తున్నావు?" అని అక్కయ్య రెట్టించిన కోపంతో వాడికేసి చూసింది.

"మీరు చూ-శా-రాం-డీ—" అన్నాడు మాటలు తడబడుతూ వాడు. వాడి ముఖకవళికలు మారిపోయాయి. బిక్కమొఖం వేశాడు. వణికిపోతున్నాడు

"వాచీ ఏం చేశావో చెప్పు? తీసుకొచ్చియిచ్చేయ్! మాతమ్ముడు కూడా నీ వెంట వస్తాడు. నువ్వు కాని ఇవ్వకపోతావో నిన్ను పోలీసులకి వప్పగిస్తాం! వాళ్లు నిన్ను లాఠీ కర్రలతో వొళ్లంతా పచ్చిపుండయ్యేలాగ కొడతారు. తరువాత చీకటికొట్లో పారేస్తారు. తిండి పెట్టరు. ఒరేయ్! నువ్వెళ్లి పోలీసుల్ని తీసుకురా!" అంది అక్కయ్య అన్నయ్యతో.

అన్నయ్య రెండడుగులు ముందుకి వేశాడు.

"అమ్మగారూ! నన్ను పోలీసులకి వప్పగించకండి! మీ వాచీ మీకిచ్చేస్తాను!" అన్నాడు సోవిఁగాడు ఏడుస్తూ.

అన్నయ్య తక్కున ఆగిపోయాడు.

"వాచీ ఎక్కడుంది?" అడిగింది అక్కయ్య.

"వాచీని నే నే దొంగిలించానండి. దాన్ని కోమటి సుబ్బయ్యగారి దగ్గర రెండు రూపాయలకి కుదవబెట్టాను. నా దగ్గర 5 అణాలు తక్కువగా వున్నాయి. మీరు గాని........"


ప్రమాద రక్షణకు
ప్రశస్తమైనది
భీమా

ఎప్పుడే ప్రమాదం వచ్చేదీ, ఏ క్షణం ఎలా ఉండేదీ తెలియని ఈ దినాల్లో
* అగ్ని * మోటార్‌కారు * కార్మిక నష్టపరిహారం
* నౌక * ఫయడిలిటీ గ్యారంటీ * మొదలైన భీమాలకు
——మా తో సంప్రదించండి;——

యునైటెడ్ ఇండియా ఫైర్ అండ్
జనరల్ ఇన్సురెన్సు కంపెనీ లిమిటెడ్,

"యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగ్సు" ఎస్ప్లనేడ్ - మద్రాసు.
Telephone : 4241. Telegrams : "UNIGEN"
బ్రాంచీలు : { బొంబాయి - కలకత్తా - కొలంబో - సింగపూరు - విజయవాడ - ఢిల్లీ - పాట్నా - లక్నో - బెంగుళూరు - కోయంబత్తూరు.

"ఒరేయ్! నువ్వు మరో అయిదణాలు వేసి, మొత్తం రెండు రూపాయలు, ఆ సుబ్బయ్య ఎవడో వాడికిచ్చి వాచీ విడిపించుకురా!" అంది అక్కయ్య, అన్నయ్య చేతికి రూపాయి పదకొండు అణాలూ, "సోవిఁగాడి" దగ్గర తీసుకుని ఇస్తూ.

## 4

అన్నయ్య మొహం కలకలలాడుతోంది. తన చేతికున్న వాచీని సంతోషంతో చూచుకుంటూ, అక్కయ్యని సమీపించాడు.

"అక్కయ్యా! ఆ సుబ్బయ్య ఎవడో గాని, వాడి తస్సాదియ్యా గట్టివాడిలా వున్నాడే! 'వీడెవడో నాకు తెలీదు. వీడు నా దగ్గర వాచీ కుదవ పెట్టటమేమిటి? నాకు తెలీదు పొమ్మన్నాడు.' అప్పుడు 'సోవిఁగాడు' ఏడుస్తూ, 'ఓ అరగంట క్రితం రెండు రూపాయలకు వాచీ కుదవ పెట్టలేదుటండీ? నా వాచీ నా కివ్వండి, ఇవిగో రెండురూపాయలూ తీసుకుని;' అన్నాడు. సుబ్బయ్య తనకి వాచీ సంగతి తెలియనే తెలియదన్నాడు. వీడికి ఇలా కాదు అనుకొని, 'నిన్ను పోలీసులకి పట్టిస్తా'. అని వాడిని భయపెట్టి వాడికి మరో రూపాయి ఎక్కువ ఇచ్చుకొని వాచీ తెచ్చుకున్నాను.' అన్నాడు అన్నయ్య మహోఘన కార్యం చేసిన వాడిలా.

"మరి మొదట్లో సన్నెందుకు అనుమానించావు? సన్నెందు కడిగావు వాచీ గురించి," అన్నాడు సూర్యం.

"తరువాత నిన్ను నేను అడగలేదుగా!" అంది అక్కయ్య.

"అక్కయ్యా! నీవు దొంగను ఎలా కనుక్కున్నావు? నీకు కనిపించిన వస్తువేమిటి? సోవిఁగాడిని ఎందుకు అనుమానించావు? నువ్వు తాతయ్య గది ముందర పిల్లలకి హిందీ అక్షరాలు నేర్పుతున్నావు కదా, మరి నీగదిలో నుంచి 'సోవిగాడు' సందులోనుంచి వెళ్లడం చూశానన్నావు? అది అబద్ధమా కాదా? అట్లా ఎందుకు దబాయించావు?" అని అన్నయ్య అక్కయ్య మీద ప్రశ్నల వర్షం కురిపించాడు.

"నాకు సందులో నీగది ముందర మెట్లమీద కనిపించిన వస్తువు బీడీ పీక. మనింట్లో బీడీలు, సిగరెట్లూ ఎవ్వరూ కాల్చరు కదా—అందుచేత ఇక్కడికిది ఎలా వచ్చింది, అనుకున్నాను. బహుశా ఈ బీడీ పీకకీ వాచి పోవటానికీ ఏమైనా సంబంధం వుండవచ్చు అనుకున్నాను. మనింటికి రోజూ వచ్చే వాడు మన దాసీదాని కొడుకు సోవిఁగాడు. వాడు రోజూ చద్ది అన్నం తినటానికి సరిగ్గా తొమ్మిది కల్లా తయారవుతాడు. వాడు రెండు మూడుసార్లు పెరట్లో సపోటా


మెరయుచు పొంగే పానీయము
వేసవికాలములో కలిగే
కడుపులోని అస్వస్థతలను
పోగొట్టును



వేసవికాలములో మీ కడుపులో సులభముగ అస్వస్థత కలుగును. మెరయుచు పొంగే గ్లాసెడు చల్లని ఈనో కడుపును సరిచేసి, జీర్ణకోశము చురుకుగా ఆరోగ్యవంతముగా ఉండేలా క్రమపరచును. ఈనో సౌమ్యముగ, సమర్థతతో అమ్లాధిక్యత వలన కలిగే అజీర్ణము, గుండెమంట మరియు కడుపు ఉబ్బరములకు సత్వరముగ నిశ్చయమైన ఉపశమనము కలిగించును. దానిని పరకడుపున కొంచెము పెద్ద మోతాదు త్రాగితే సౌమ్యవిరేచనకారిగా పనిచేయును.

ఎంతో చల్లగా మరియు
ఆహ్లాదకరముగా ఉండును!

ఈనోస్
'ఫ్రూట్ సాల్ట్'

'ఈనో' మరియు 'ఫ్రూట్ సాల్ట్' అను మాటలు
రిజిష్టరు చేయబడిన ట్రేడు మార్కులు

[illegible]

# ★ వాచీదొంగ ★

చెట్టు దగ్గర బీడీలు కాలుస్తూండగా చూసి మందలించాను. వాడి మీద నాకు అనుమానంవేసి, వాళ్ళమ్మను పిలిచాను. అది వాడింకా చద్ది అన్నం తినటానికి రాలేదనీ, వేళ దాటిందనీ చెప్పింది. వాడిమీద నా అనుమానం దృఢ పడింది నిన్ను వెళ్లి వాణ్ణి తీసుకు రమ్మన్నాను. నువ్వూ సూర్యం వెళ్లారు వాడిని తీసుకు రావటానికి వాడూ-వాడి చర్యలూ గురించి, కాఫీ హోటల్లోని వివరాలు మీరు నాకు చెప్పారు వాడికి కాఫీ హోటలుకి వెళ్లటానికి డబ్బులు ఎక్కడవి? అని నాలో నేను ప్రశ్నించుకున్నాను. వాచీ ఎవరిదగ్గరో తాకట్టు పెట్టి వుంటాడని ఊహించాను 'నీకీ డబ్బు లెక్కడివి?' అని వాడిని అడిగినప్పుడు - మొదట వాళ్ళమ్మ ఇచ్చిందనీ, తర్వాత దొరికాయి అనీ చెప్పాడు. అబద్ధమెందుకు చెప్పానంటే ఏదో చెప్పి సమర్థించుకున్నాడు. తరువాత, నాకు కనిపించిన 'బీడీ పీక'మీద 'మూడు గుర్రాలు'న్నాయి. వాడి దగ్గరున్న 'బీడీ పీక' మీద కూడ 'మూడు గుర్రాలే' వున్నాయి. వాడికి బీడీపీక 'గుర్తులు, సాక్ష్యంగా చూపిద్దా మనుకున్నాను. కాని, వాడు మనింటికే రాలేదని దబాయిస్తున్నాడు దబాయింపుకి దబాయింపేమందు అని, 'నేను నువ్వు సందులోనుంచి వెళ్తూండగా చూశానని దబాయించేను' వాడు బిక్క మొఖం వేశాడు. పోలీసులకి వప్పగిస్తానని భయపెడితే, వాడు తను దొంగిలించినట్లు, సుబ్బయ్య దగ్గిర 2 రూపాయలకు తాకట్టుపెట్టినట్లు చెప్పాడు. నువ్వెళ్ళి, వాడికి మరో రూపాయి ఎక్కువగా చెల్లించి వాచీ విడిపించుకొని తెచ్చుకున్నావు," అని అక్కయ్య ఊహించిందీ, జరిగిందీ-కళ్ళకి కట్టినట్లుగా చెప్పి, తన ఉపన్యాసం ముగించింది.

"ఈ విషయంలో సూర్యం కూడ మనకి చాల సహాయం చేశాడక్కయ్యా!" అన్నాడు అన్నయ్య. సూర్యం పొంగిపోయాడు. సంతోషంగా నవ్వేడు

"మరి, ఈ 'డిటెక్టివ్'కి బహుమానం ఏ మిచ్చుకుంటావో?" అంది అక్కయ్య

"ఈ నెలాఖరున జీతం అందటంతో నీ కొక వెల్వెట్ జాకెట్టూ, సూర్యానికొకలాగూ, చొక్కా కుట్టిస్తాను," అన్నాడు అన్నయ్య

"మాటలనగానే సరిగాదు! అన్న మాట నిలబెట్టుకోవాలి అబ్బాయి గారు!" అంది అక్కయ్య చిరునవ్వుతో.

వాచీ పోవటం, "అక్కయ్య అపరాధ పరిశోధన" చెయ్యటం దొంగ ఎవరో తెలుసుకోవటం, ఇంట్లో ఎవ్వరికీ తెలీదు! పోవటం-దొరకటం అంతా ఒక గంటలో అయిపోయింది! తరువాత ఇంట్లో వాళ్లందరికీ తెలిసింది. దాసీ దానికి కూడ తెలిసింది అందరూ ఆశ్చర్యపోయారు!

★

### మాట వరసకి…'

పాఠశాల వార్షికోత్సవం జరుగుతోంది. ఒక ప్రముఖ వ్యాపారస్థుడు పిల్లలకి నీతులు చెబుతూ ఉపన్యసిస్తున్నాడు.

"చూశారూ పిల్లలూ అందరూ చదువుకోవాలి చదువంత మంచి వస్తువు ఇంకొకటి లేదు. చదువువల్లనే మనకి అన్నీ తెలుస్తా యన్నమాట

"మాటవరసకి లెక్కలు చూడండి. లెక్కలు నేర్చుకుంటే,' మనకి రెండు రెళ్ళు నాలుగని తెలుస్తుంది నాలుగు నాలుగులు పదహారని, పదహారు పదహార్లు...ఏం, ఆ తరవా జాగర్త ఉందనుకోండి..."


ప్రెసిడెంట్

వెజిటబుల్ హెయిర్ ఆయిల్,
స్నో, టాల్కమ్ పౌడర్

నా ఉపయోగానికి శ్రేష్ఠమైనవని నేను కనుగొన్నాను
—(సం) సావిత్రి



ఉత్పత్తిదారులు
రథోడ్ ట్రేడింగ్ కంపెనీ, మద్రాసు - 1.



మంచీ - చెడూ
వెల 2-0-0
పోస్టుఖర్చు ప్రత్యేకం
ఆంధ్ర గ్రంథమాల మద్రాసు.